వెలుగుల సంబురం

- వైభవంగా దీపావళి పండుగ
- మిరుమిట్లు గొలిపిన పటాకులు
- లక్ష్మీ పూజలు, కేదారీశ్వర వ్రతాలు

జనగామ, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ) : కాకర పుల్లల కాంతులు.. చిచ్చుబుడ్ల వెలుగులు.. రయ్.. రయ్‌మంటూ మిరుమిట్లు గొలిపే తారాజువ్వల సందడితో గురువారం జిల్లా ప్రజలు దీపావళి సంబురాలను ఘనంగా జరుపుకున్నారు. చిన్నా, పెద్ద తేడా లేకుండా ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు పటాకులు కాలుస్తూ పిల్లలు, పెద్దలు సంబురాలు జరుపుకున్నారు. వాణిజ్య, వ్యాపార సముదాయాలు, గృహాల్లో లక్ష్మీపూజలు, కేదారీశ్వర వ్రతాలు జరుపుకున్నారు.

దీపాలు వెలిగిస్తున్న తల్లీ కూతుళ్లు

నేటి నుంచి కార్తీకం

కార్తీక మాసం శనివారం నుంచి ప్రారంభమవుతుంది. ఆలయాల్లో ప్రత్యేక పూజల కోసం సిద్ధం చేశారు. నెలరోజులపాటు భక్తులు ఉపవాస దీక్షలతో భోళాశంకరుడు, విష్ణుమూర్తిని అత్యంత భక్తిశ్రద్ధలతో కొలుస్తారు. ఈ మేరకు జిల్లాలోని శైవక్షేత్రాలతోపాటు విష్ణు ఆలయాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి పూజలకు ఏర్పాట్లు చేశారు. పాలకుర్తి సోమేశ్వరస్వామి, కొడవటూరు సిద్ధేశ్వరాలయం, చీటకోడూరు పంచకోసు రామలింగేశ్వర మల్లికార్జునస్వామి తదితర ప్రధాన ఆలయాల్లో ఏర్పాట్లు చేశారు.

రద్దీగా బస్టాండ్, రైల్వేస్టేషన్

దీపావళి పండుగకు సొంతూళ్లకు వచ్చిన వారంతా తిరుగు ప్రయాణం కావడంతో శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం, రైల్వేస్టేషన్ సందడిగా కనిపించింది. దీపావళి పర్వదినం, లక్ష్మీపూజలు, నోములకు వివిధ ప్రాంతాల నుంచి స్వస్థలాలకు, బంధువుల ఇళ్లకు ప్రయాణీకుల రాకపోకలతో రద్దీ పెరిగింది. దీనికి అనుగుణంగా ఆర్టీసీ జనగామ డిపో అధికారులు అదనపు బస్సులను నడుపుతున్నారు.

బచ్చన్నపేట: బచ్చన్నపేట మండలంలోని ఆలీంపూర్‌లో కేదారీశ్వర పూజలో ప్రజలు

శివునిపల్లిలో పటాకులు కాలుస్తున్న కుటుంబం

నేడు బీసీ కమిషన్ సమావేశం

జనగామ చౌరస్తా, నవంబర్ 1: రాష్ట్ర బీసీ కమిషన్ ఆధ్వర్యంలో వరంగల్ ఉమ్మడి జిల్లా స్థాయి బహిరంగ విచారణ సమావేశం శనివారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో జరుగుతుందని జనగామ జిల్లా బీసీ అభివృద్ధిశాఖ అధికారి బీ రవీందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో జిల్లాలోని బీసీ కులాల విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, యువకులు, మేధావులు, పెద్దలందరూ పాల్గొని వారి ఆర్థిక, సామాజిక, రాజకీయ అభివృద్ధి సామర్థ్యాల పెంపుపై వినతిపత్రాలు, డాక్యుమెంటరీ రూపంలో కమిషన్ చైర్మన్ లేదా సభ్య కార్యదర్శి పేరిట కమిషన్‌కు సమర్పించాలని పేర్కొన్నారు.

డీఎంహెచ్‌వో బాధ్యతల స్వీకరణ

మల్లికార్జున్‌రావు, డీఎంహెచ్‌వో

జనగామ చౌరస్తా, నవంబర్ 1 : జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌వో)గా కే మల్లికార్జునరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది స్వాగతం పలుకుతూ శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు.

నాయబ్ తహసీల్దార్..

లచ్చునాయక్, నాయబ్ తహసీల్దార్

దేవరుప్పుల, నవంబర్ 1: నాయబ్ తహసీల్దార్‌గా నునావత్ లచ్చునాయక్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ నాయబ్ తహసీల్దార్‌గా పనిచేసిన దోపతి నవీన్‌కుమార్ రెడ్డి అక్టోబర్ 30న అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన స్థానంలో లచ్చునాయక్ బాధ్యతలు స్వీకరించారు.

మత్స్యపారిశ్రామిక డైరెక్టర్‌గా యాకయ్య

పాలకుర్తి, అక్టోబర్ 1: మత్స్య పారిశ్రామిక సహకార సంఘం డైరెక్టర్‌గా నారగోని యాకయ్య గెలుపొందాడు. బుధవారం ముదిరాజ్ సంఘం ఎన్నికలు గూడూరులో నిర్వహించారు. చిక్కుడు రాములుపై యాకయ్య గెలుపొందాడు. కాగా యాకయ్యను ఎఫ్ఎస్‌సీఎస్ బ్యాంక్ చైర్మన్ బొబ్బల అశోక్‌రెడ్డి అభినందించారు.

మాజీ మంత్రి ఎర్రబెల్లికి దీపావళి శుభాకాంక్షలు

ఎర్రబెల్లికి స్వీట్లు అందిస్తున్న శ్రీకాంత్ గౌడ్

దేవరుప్పుల, నవంబర్ 1: మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బబ్బూరి శ్రీకాంత్‌గౌడ్ కలిశారు. హైదరాబాద్‌లోని మాజీ మంత్రి ఎర్రబెల్లి స్వగృహానికి శుక్రవారం వెళ్లి ఆయనను కలిసి స్వీట్లు అందించి, దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

చెరువులో చేపపిల్లలు వదిలిన మత్స్యకారులు

చేపపిల్లలను వదులుతున్న మత్స్య కారులు

లింగాలఘనపురం, నవంబర్ 1: మత్స్యకార్మిక సంఘం నాయకులు శుక్రవారం ప్రభుత్వం సరఫరా చేసిన 3.80 లక్షల చేపపిల్లలను లింగాలఘనపురం, నేలపోగుల, గుమ్మడవెల్లి, బండ్లగూడెం, పటేలుగూడెం, కుందారం, వడిచర్ల చెరువుల్లో వదిలారు. లింగాలఘనపురంలో మత్స్యకార్మిక సంఘం నాయకులు ఇటుకల సత్యనారాయణ, కాశబోయిన యాదగిరి, అధికారులు వెంకటేశ్వర్లు, పూర్ణచందర్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

జఫర్‌గఢ్, నవంబర్ 1 : మండలంలోని తమ్మడపల్లి(జీ)కి చెందిన గాదె సంధ్యకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కును ఆమె కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి శుక్రవారం అందించారు. హనుమకొండలోని ఎమ్మెల్యే నివాసంలో గాదె సంధ్యకు మంజూరైన రూ.2,25వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కును కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదల వైద్య ఖర్చులకు సీఎంఆర్ఎఫ్ అండగా నిలుస్తుందన్నారు. ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ మారపల్లి ప్రభాకర్, మాజీ వార్డు సభ్యుడు సంపత్, కొంతం లక్ష్మీ నారాయణ, గాదె అంబేద్కర్, పులి హరీశ్ పాల్గొన్నారు.

ట్రాక్టర్ల నుంచి డీజిల్ చోరీ

ట్రాక్టర్ డీజిల్ సప్లై పైపు కట్ చేసిన దృశ్యం

దేవరుప్పుల, నవంబర్ 1: మండల కేంద్రంలో ఒకేరోజు నాలుగు ట్రాక్టర్ల నుంచి డీజిల్‌ను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. బాధిత ట్రాక్టర్ల యజమానులు కారుపోతుల సతీష్, తాళ్లపల్లి నర్సయ్య, ఆకుల శ్రీనివాస్, జక్కుల కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తెల్లవారుజామున ట్రాక్టర్‌తో పని ఉందని గురువారం రాత్రి డీజిల్ ఫుల్ ట్యాంక్ చేయించారు. ఇళ్ల ముందున్న ట్రాక్టర్లకు డీజిల్ సప్లై చేసే పైపులను కట్ చేసి డీజిల్ చోరీ చేశారు. శుక్రవారం డీజిల్ కింద పడి, పైపు కట్ చేసి ఉండడాన్ని చూసిన చోరీ జరిగిందని గుర్తించారు. పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

ఏపీజీవీబీ సేవలను వినియోగించుకోవాలి

మాట్లాడుతున్న ఏపీజీవీబీ మేనేజర్ ప్రవంతి

జఫర్‌గఢ్, నవంబర్ 1 : మండల కేంద్రంలోని ఏపీ గ్రామీణ వికాస బ్యాంక్ (జీవీబీ) సేవలను సద్వినియోగం చేసుకోవాలని బ్రాంచ్ మేనేజర్ పీ ప్రవంతి కోరారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో శుక్రవారం ఖాతాదారుల సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అర్హులకు తక్కువ వడ్డీకి రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. వికాస్ ధనరత్న పథకంలో ఫిక్స్ డిపాజిట్‌పై ఇతర బ్యాంకుల కన్నా అధిక వడ్డీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పథకంలో డిపాజిట్ చేసే సీనియర్ సిటిజన్‌లకు 8.10శాతం, ఇతరులకు 7.60శాతం వడ్డీ అందిస్తున్నట్లు వివరించారు. తక్కువ వడ్డీ రేటుతో గృహ రుణాలు, టాప్‌అప్ లోన్లు, స్థిరాస్తి తనఖా, విద్యా, వెహికిల్ లోన్స్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎస్ఎంఈ డెయిరీ, పౌల్ట్రీ, ముద్ర రుణాల సదుపాయం, బ్యాంక్ లాకర్ సౌకర్యం ఉందని చెప్పారు. ఫీల్డ్ ఆఫీసర్ మధుకర్, క్యాషియర్ లక్ష్మయ్య, అటెండర్ జగన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ

క్రీడా దుస్తులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

కొడకండ్ల, నవంబర్ 1: మండలంలోని మొండ్రాయి జిల్లా ప్రజాపరిషత్ పాఠశాలలోని విద్యార్థులకు ఎమ్మెల్యే యశస్విని రెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు. దాతలు, బీఆర్ఎస్ పార్టీ గిర్నితండా గ్రామ అధ్యక్షుడు వెంకన్ననాయక్ ధరావత్ తల్లి అంజమ్మ జ్ఞాపకార్థం, తిరుమలగిరికి చెందిన రాపాక సోమన్న క్రీడా దుస్తులను అందించారు. ప్రధానోపాధ్యాయుడు అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పంపిణీ చేశారు. పాఠశాల చైర్మన్ కృపరాణి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేష్‌నాయక్ పాల్గొన్నారు.

జీపీ కార్యాలయాన్ని మార్చాలి

పాలకుర్తి, నవంబర్ 1: మండలంలోని మల్లంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని మార్చాలని గ్రామస్తుడు గర్వందుల మల్లేశ్ కోరాడు. పంచాయతీ కార్యాలయ భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరడంతో స్థానికంగా ఓ వ్యక్తికి చెందిన ఇంట్లో అద్దెకు తీసుకొని కొనసాగిస్తున్నారు. పంచాయతీ కార్యాలయం గది పక్కనే మరో గదిలో కిరాణం ఉండగా అందులో బెల్టుషాపు నిర్వహిస్తున్నట్లు మల్లేశ్ ఆరోపించాడు. ఈ విషయంపై ఎంపీడీఓ ఆవుల రాములును వివరణ కోరగా జీపీ కార్యాలయాన్ని మరోచోటకు మారుస్తామని తెలిపారు.

ఫోన్ పోతే సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలి

పోయిన ఫోన్‌ను బాధితురాలికి అప్పగిస్తున్న సీపీ

నయీంనగర్, నవంబర్ 1 : ఎవరైనా సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే చింతించవద్దని, తక్షణమే సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని పోలీస్ కమిషనర్ అంబర్‌కిశోర్‌ఝా సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సీసీఎస్ పోలీసుల ఆధ్వర్యంలో సెల్‌ఫోన్ రికవరీ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ల ఆచూకీ కనుగొని, స్వాధీనం చేసుకున్న ఫోన్లను సీపీ చేతుల మీదుగా యజమానులకు అందజేశారు. అనంతరం సీపీ మాట్లాడుతూ పోగొట్టుకున్న ఫోన్‌ల ఆచూకీ కోసం ప్రతి స్టేషన్‌లో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కమిషనరేట్ పరిధిలో ఇప్పటి వరకు 8,226 మంది సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయగా ఇందులో 4,931 సెల్ ఫోన్లను గుర్తించినట్లు తెలిపారు. అందులో ఇప్పటి వరకు 3,257 ఫోన్లను స్వాధీనం చేసుకొని యజమానులకు అందజేశామని చెప్పారు. వారం రోజులుగా సీసీఎస్ పోలీసులు శ్రమించి మరో 55కు పైగా ఫోన్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం ఫోన్లను కనుగొనడంలో ప్రతిభ కనబర్చిన పోలీసులను సీపీ అభినందించారు. కార్యక్రమంలో క్రైమ్ ఏసీపీ భోజరాజు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు బాలాజీ వరప్రసాద్, రఘుపతిరెడ్డి, ఐటీ కోర్ హెడ్ కానిస్టేబుల్ మాధవరావు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకోవాలి

ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

కొడకండ్ల, నవంబర్ 1: కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని లక్ష్మక్కపల్లిలో రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సురేష్‌నాయక్, సీనియర్ నాయకులు వెంగళ్‌రావు, రాజేశ్‌నాయక్, మధు, క్రాంతి పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఎర్రబెల్లి పరామర్శ

మల్లేశ్ కుటుంబాన్ని ఓదార్చుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి

దేవరుప్పుల, నవంబర్ 1: మండలంలోని చింతబావితండా వద్ద రోడ్డు ప్రమాదంలో మాధాపురానికి చెందిన వీఆర్ఏ పందెన బోయిన మల్లేశ్ మృతిచెందాడు. గురువారం గ్రామానికి వెళ్లిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మల్లేశ్ పార్థివదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ధరావత్ రాంసింగ్, మండల ప్రధాన కార్యదర్శి చింత రవి, మాజీ ఎంపీపీ కొల్లూరు సోమయ్య, మాజీ సర్పంచ్ కోక్యానాయక్, మాధాపురం మాజీ ఎంపీటీసీలు మడికొండ ఎల్లయ్య, యాకూబ్‌నాయక్, పార్టీ గ్రామ అధ్యక్షుడు చిలుకాని రాజు, శ్రీను, నాగరాజు ఉన్నారు. కాగా, అదే రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్సపొందుతున్న దౌపాటి అనిల్‌ను మాజీ మంత్రి ఎర్రబెల్లి అక్కడికి వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. మండల నాయకుడు పల్లా సుందరరాం రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ అనంతోజు కృష్ణమూర్తి ఉన్నారు.

సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

బచ్చన్నపేట: గోపాల్‌నగర్‌లో మ్యాపింగ్ సర్వేను పరిశీలిస్తున్న జేసీ రోహిత్‌సింగ్

బచ్చన్నపేట, నవంబర్ 1: సర్వేను పకడ్బందీగా చేపట్టాలని జేసీ రోహిత్‌సింగ్ అన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని గోపాల్‌నగర్‌లో చేస్తున్న మ్యాపింగ్ సర్వేను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సర్వేకు ముందు ఇండ్ల జాబితాను తయారు చేయాలన్నారు. మ్యాపింగ్ ప్రకారం ఇండ్ల నంబర్‌తో సర్వే నిర్వహించాలన్నారు. మండల ప్రత్యేకాధికారి రామారావునాయక్, ఎంపీడీవో మల్లికార్జున్, తహసీల్దార్ ప్రకాశ్‌రావు, పంచాయతీ కార్యదర్శి మోకు కవిత, కారోబార్ కొండ లలిత, అంగన్‌వాడీ టీచర్ పస్తం లక్ష్మి పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులతో సమావేశం

పాలకుర్తి/లింగాలఘనపురం: సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కులగణన సర్వేపై ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో జిల్లా పంచాయతీ అధికారి ఎన్ స్వరూపరాణి సమావేశం నిర్వహించారు. డీపీఓ మాట్లాడుతూ ఒక ఎన్యూమరేటర్‌కు గ్రామంలో ఒకరోజుకు 150ఇళ్లను రాసి పెట్టుకోవాలని సూచించారు. ఈనెల 6వ తేదీ నుంచి సర్వే ఉంటుందని, ప్రతి గ్రామంలో పంచాయతీ కార్యదర్శి చాటింపు చేయించాలని ఆదేశించారు. ఎంపీడీఓ ఆవుల రాములు, ఎంపీఓ రవీందర్ పాల్గొన్నారు. లింగాలఘనపురం మండలంలో మ్యాపింగ్ సర్వే ప్రారంభమైంది. కొత్తపెల్లిలో ఎంపీడీవో జలేందర్‌రెడ్డి పాల్గొని సర్వేను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. కొత్తపెల్లి, లింగాలఘనపురం పంచాయతీ కార్యదర్శులు ప్రవీణ్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజలు మూఢనమ్మకాలను వీడాలి

జీడికల్‌లో ప్రదర్శన ఇస్తున్న జాగృతి పోలీస్ కళాబృందం

లింగాలఘనపురం, నవంబర్ 1: ప్రజలు మూఢనమ్మకాలను వీడాలని, యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై శ్రావన్‌కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని జీడికల్‌లో బుధవారం రాత్రి జరిగిన జాగృతి పోలీస్ కళాబృందం ప్రదర్శనలో ఎస్సై ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. యువత గంజాయి, డ్రగ్స్, గుట్కా మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఎవరైనా గంజాయి విక్రయించినా, తాగినా 8712584473 సెల్ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. రోడ్డు ప్రమాదాలు జరిగినా సమాచారం ఇవ్వాలన్నారు. మ్యాజిక్‌షో, సామాజిక అంశాలపై పాటల ద్వారా వివరిస్తూ, సైబర్ క్రైమ్స్‌పై ప్రదర్శన ఇస్తూ, 1930 సైబర్ హెల్ప్‌లైన్ నంబర్ గురించి అవగాహన కల్పించారు. కళాబృందం ఇన్‌చార్జి నాగమణి, నవీన్, సభ్యులు హెచ్‌సీ విలియమ్, వెంకటేశ్వర్లు, రత్నయ్య, శ్రీనివాస్, నారాయణ, విక్రమ్‌రాజు, చిరంజీవి పాల్గొన్నారు.

పురుగులమందు తాగి ఆత్మహత్య

వినయ్ (ఫైల్)

నర్మెట, నవంబర్ 1: పురుగుల మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం జరిగింది. ఎస్సై నైనాల నాగేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అమ్మాపురానికి చెందిన కుంటి ఎల్లయ్య కుమారుడు వినయ్ (22) గురువారం సాయంత్రం స్థానిక అంగడిలో పురుగులమందు తాగి చనిపోతున్నట్లు బంధువులకు తెలియజేశాడు. స్థానికులు జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యుల సూచన మేరకు వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

యశ్వంత్

లింగాలఘనపురం, నవంబర్ 1: రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు నవాబుపేట హైస్కూల్ విద్యార్థి విజ్జగిరి యశ్వంత్ ఎంపికైనట్లు హెచ్ఎం ఎన్ సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. ఈ నెల 30న హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన అండర్-14 సెలక్షన్స్‌లో యశ్వంత్ పాల్గొని ప్రతిభ చాటినట్లు హెచ్ఎం వివరించారు. పీఈటీ ఇంద్రసేనారెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ సిద్దిలక్ష్మి, ఎంఈవో విష్ణుమూర్తి అభినందించారు.

అమ్మ ఆదర్శ కమిటీలకు నిధులు విడుదల చేయాలి

పాలకుర్తి, అక్టోబర్ 1: అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మతులు పూర్తి చేసినందున వెంటనే నిధులను విడుదల చేయాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇమ్మడి అశోక్ కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాలతో ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కోసం అమ్మ ఆదర్శ కమిటీల పేరుతో పనులు చేసినట్లు తెలిపారు. పూర్తయి నెలలు గడుస్తున్నా బిల్లులు రాకపోవడంతో హెచ్ఎంలు, అమ్మ ఆదర్శ కమిటీల నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే నిధులు విడుదల చేయాలని కోరారు.

జ్యువెల్లరీ షాపులో అగ్ని ప్రమాదం

స్వల్పంగా ఫర్నీచర్ దగ్ధం

మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

జనగామ చౌరస్తా, నవంబర్ 1: జిల్లా కేంద్రంలోని పాతబీటు బజార్‌లో ఉన్న ఆధ్యా జ్యువెల్లర్స్ అండ్ వర్క్స్‌లో శుక్రవారం సాయంత్రం అగ్ని ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఫైరింజన్‌తో వచ్చి మంటలను ఆర్పేశారు. ఈ ప్రమాదంలో షాప్‌లో ఉన్న ఫర్నీచర్ స్వల్పంగా దగ్ధమైంది. దీపావళి పండుగ కావడంతో షాప్ యజమాని జక్కోజు శ్రీధర్‌చారి పూజలు చేసి దీపం పెట్టి సాయంత్రం దుకాణం మూసివెళ్లగా ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు అంచనా వేశారు. లేదంటే సీసీ కెమెరాల కోసం షాప్‌లో ఆన్ చేసి ఉంచిన స్విచ్‌బోర్డులో ఏదైనా షార్ట్ సర్క్యూట్ జరిగిందా! అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలాన్ని అర్బన్ సీఐ పీ దామోదర్‌రెడ్డి పరిశీలించారు. ఐదు రోజుల క్రితం జిల్లా కేంద్రంలో విజయ, శ్రీలక్ష్మి షాపింగ్ మాల్‌తో పాటు ఎస్ఆర్ బ్రదర్స్ బట్టల షాపులో భారీ అగ్ని ప్రమాదాన్ని ప్రజలు మరిచిపోకముందే మరో ఘటన జరగడం చర్చనీయాంశంగా మారింది.

అన్నదానం.. మహాదానం

రఘునాథపల్లి: అన్నదానం చేస్తున్న మాజీ సర్పంచ్ శివకుమార్

జఫర్‌గఢ్: అన్నదానం చేస్తున్న ఆర్యవైశ్యులు

రఘునాథపల్లి/జఫర్‌గఢ్, నవంబర్ 1: అన్నదానం మహాదానమని ఆర్యవైశ్య రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, మాజీ సర్పంచ్ పోకల శివకుమార్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం వాసవీ సేవా సంఘం ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేదలకు పట్టెడు అన్నం పెట్టడంలోనే నిజమైన ఆనందం ఉందన్నారు. ఆర్య వైశ్య సంఘం మండల అధ్యక్షుడు గంద వీరయ్య, వాసవీ సంఘం మండల అధ్యక్షుడు ఓరుగంటి శంకర్‌లింగం, తుమ్మలపల్లి సోమేశ్వర్, బచ్చు శ్రీనివాస్, కూరెళ్లి ఉపేందర్, పడకంటి రవీందర్, గందె లిరిల్‌కుమార్, భోజనాథం పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..

జఫర్‌గఢ్: మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని గాంధీసెంటర్‌లో అన్నదాన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. సంఘ సభ్యులు పాల్గొని అన్నదాన వితరణ చేశారు. ఆర్యవైశ్య సంఘం బాధ్యులు మాట్లాడుతూ సంఘంలోని దాతల సహకారంతో ప్రతి నెల అమావాస్య రోజున వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లోనూ ప్రతి నెల అమావాస్య రోజున అన్నదానం చేయనున్నట్లు తెలిపారు. సంఘం బాధ్యులు బోనగిరి శ్రవణ్‌కుమార్, రామయ్య, శంకర్, యుగేందర్, సోమేశ్వర్, ఇమ్మడి అశోక్, సోమయ్య, చిన్న సంతోష్, సతీష్, దొడ్డ రాజు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

రఘునాథపల్లి, నవంబర్ 1: మండలంలోని గోవర్ధనగిరి గ్రామానికి చెందిన సంపత్ నారాయణరెడ్డి గురువారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య జనగామ మార్చురీలో ఉన్న నారాయణరెడ్డి మృతదేహాన్ని సందర్శించారు. కుటుంబసభ్యులను ఓదార్చి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ముసిపట్ల విజయ్‌కుమార్, మాజీ సర్పంచ్ ముప్పిడి యాదగిరి, వడాల స్వామి, సిలువేరు వెంకటయ్య, సంపతి మల్లారెడ్డి, చాట్ల ఆంజనేయులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీకి ఘననివాళి

రఘునాథపల్లి/బచ్చన్నపేట, నవంబర్ 1: దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 40వ వర్ధంతి గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు నిర్వహించారు. రఘునాథపల్లి మండల కేంద్రంలోని ఇందిరాగాంధీ విగ్రహానికి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోళ్ల రవి గౌడ్ ఆధ్వర్యంలో పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడారు. జిల్లా కాంగ్రెస్ నాయకుడు మేకల నరేందర్, గాదె మహేందర్‌రెడ్డి, కాబట్టి భాస్కర్ యాదవ్, కొయ్యడ ప్రభాకర్, మినుముల వెంకటరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, అల్లి బిల్లి కృష్ణ, గాదె మహేందర్, ఎండీ ఇబ్రహీంభాషా, కడారి రవి, రంగు రాజు, బిర్రు రామాంజనేయులు, ఆనంద్, గొరిగె భాస్కర్, జాలయ్య, కనకయ్య, మధు పాల్గొన్నారు. బచ్చన్నపేట మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.